సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

98490 98674

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

అప్పి కొండకు ప్రత్యేక బస్సులు

ఉక్కునగరం: మహాశివరాత్రి సందర్భంగా కూర్మన్నపాలెంలోని స్టీల్‌సిటీ డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడపనున్నట్టు స్టీల్‌సిటీ డిపో మేనేజర్ గౌతమ్ చటర్జీ, అసిస్టెంట్ మేనేజర్ పి. శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం సాయంత్రం నుంచి గురువారం సాయంత్రం 5 గంటల వరకు అప్పికొండకు బస్సులు నడుపుతామన్నారు. లంకెలపాలెం, అగనంపూడి, రాజీవ్‌నగర్, కూర్మన్నపాలెం, వడ్లపూడి, సిద్ధార్థ నగర్, యాదవ జగ్గరాజు పేట తదితర ప్రాంతాల నుంచి బస్సులు నడుస్తాయన్నారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

దొంగకు దేహశుద్ధి


చోరీకి పాల్పడ్డ అసిరి నాయుడు

అక్కిరెడ్డిపాలెం: దొంగతనం చేసిన వ్యక్తికి స్థానికులు దేహశుద్ధి చేశారు. స్తంభానికి కట్టేసి గాజువాక క్రైం పోలీసులకు అప్పగించారు. వాంబే కాలనీలో కొలువైన శ్రీ వైకుంఠ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సావడి అసిరి నాయుడు దొంగతనానికి పాల్పడుతూ స్థానికులకు చిక్కాడు. దేహశుద్ధి చేసి స్తంభానికి కట్టి..గాజువాక క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దొంగ వద్ద నుంచి రూ.6,300 స్వాధీనం చేసుకుని, పోలీసు స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఇంటక్ నాయకుడిపై కేసులు

- చీటింగ్, దురుసు ప్రవర్తన కింద రెండు కేసుల నమోదు

అక్కిరెడ్డిపాలెం: స్టీల్‌ప్లాంట్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని మోసం చేసిన వ్యక్తిపై పోలీసులు రెండు కేసులు నమోదు చేశారు. దీనికి సంబంధించి గాజువాక సీఐ పార్థసారథి తెలిపిన వివరాలు ఇలా... స్టీల్‌ప్లాంట్‌లో ఇంటక్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్న కారు రమణ ఉద్యోగం వేయిస్తానని ఎల్. కోటకు చెందిన లెక్కల అనిల్ అనే వ్యక్తిని నుంచి రూ.1.50 లక్షలు తీసుకున్నాడు. రోజులు గడుస్తున్నా ఉద్యోగం ఇప్పించకపోవడంతో అనిల్ గాజువాక పోలీసులను ఆశ్రయించాడు. దీనిపై యూనియన్ నాయకుడిని సోమవారం పోలీసులు స్టేషన్‌కు పిలిపించారు. అక్కడ యూనియన్ నాయకుడు సీఐపై దుర్భాషలాడాడు. దీంతో ఉద్యోగం పేరుతో డబ్బులు తీసుకున్నందుకు చీటింగ్ కేసుతో పాటు విధుల్లో ఉన్న పోలీసులపై అనుచితంగా ప్రవర్తించిన వ్యవహారంపై మరో కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

రెజ్యూమ్ ఆకట్టుకునేలా ఉండాలి


అతిథి సందీప్‌ను సత్కరిస్తున్న అధ్యాపకులు

అగనంపూడి: విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్, నాయకత్వ లక్షణాలతోపాటు కంపెనీలకు పంపించే వ్యక్తిగత సమాచారం (రెజ్యూమ్) రూపొందించడం కూడా కీలకమైందని ఎంఎస్ఎం యూనిఫ్‌టెక్ దక్షిణ భారతదేశం ఇన్‌చార్జి సందీప్ అన్నారు. దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం ఎంబీఏ విద్యార్థులకు రెజ్యూమ్ రూపొందించడంలో మెళకువలు వివరించారు. విద్యార్హతలు, ప్రొఫెషనల్ ప్రొఫైల్ మెరుగుపర్చుకోవడం వంటి సమాచారం తెలిపారు. కళాశాల రెక్టార్ వి.మధుసూదనరావు, ప్రిన్సిపాల్ జె.సుధాకర్, ఎంబీఏ విభాగాధిపతి చంద్ర పాల్గొన్నారు.

ఇంటింటికీ వైద్య పరీక్షలు


పరీక్షలు నిర్వహిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

గాజువాక: గాజువాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) సిబ్బంది చినగంట్యాడలో సోమవారం ఇంటింటికీ వెళ్లి వైద్య పరీక్షలు చేశారు. ఎన్‌సీడీ సర్వేలో భాగంగా ఇంటింటికీ వెళ్లిన సిబ్బంది 18 ఏళ్లు దాటినవారికి సుగర్, బీపీ, నోటి క్యాన్సర్, బ్రెస్ట్ క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్టులు నిర్వహించారు. పీహెచ్‌సీకి సంబంధించి 11 సచివాలయాల పరిధిలోని 37,583 మంది జనాభాకు ఈ పరీక్షలు నిర్వహిస్తామని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎం.సుధాకర్ తెలిపారు. ఇప్పటివరకు 9,684 మందికి స్క్రీనింగ్ టెస్టులు పూర్తయ్యాయని, ముగ్గురిని అనుమానితులుగా గుర్తించామని పేర్కొన్నారు. వారిని మంగళవారం కేజీహెచ్‌కు పంపించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌వో పి.నాగ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక శిఖరం..
అప్పికొండ క్షేత్రం

సోమేశ్వర ఆలయానికి 900 ఏళ్ల చరిత్ర

పురాతన ఆలయాల్లో మూడో దేవస్థానం

మహా శివరాత్రికి శైవక్షేత్రాలు ముస్తాబు

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని గాజువాక ప్రాంతంలోని శైవ క్షేత్రాలు ముస్తాబయ్యాయి. ఆలయ కమిటీలు ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాట్లు చేశాయి. ఆలయాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఇక అప్పికొండ తీరంలో దేవదాయశాఖ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. జాగరణ చేసే భక్తుల కోసం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

– గాజువాక


పంచాయతన ఆలయంలో శివయ్య

ఆధ్యాత్మిక వైభవానికి సాక్ష్యంగా నిలిచే ఆలయాలు అరుదుగా ఉంటాయి. వాటిలో అప్పికొండ సోమేశ్వర ఆలయం ఒకటి. పెదగంట్యాడ మండలంలో సాగర తీరాన వెలసిన ఈ ఆలయం ఆధ్యాత్మికంగా ఎంతో ప్రాచుర్యం పొందింది. ద్రవిడ సాంప్రదాయాన్ని పుణికి పుచ్చుకొని ఉన్న ఈ ఆలయాన్ని పశ్చిమ చాళుక్యులు నిర్మించారని పరిశోధకుల అంచనా. సముద్ర తీరాన ఆహ్లాదకరమైన వాతావరణంలో వెలసిన ఈ ఆలయం శివరాత్రి సందర్భంగా అందరికీ ఆహ్వానం పలుకుతోంది.

పెద్దల పురాణం ప్రకారం

సముద్ర తీరంలో ముక్కోణపు ఆకారంలో ఉండే ఇక్కడి కొండను పూర్వం కపిల మహర్షి తపస్సుకు ఎంచుకొని.. ఆ కొండకు కపిల కొండలని నామకరణం చేశారు. కపిల మహర్షి తపోదీక్ష ఆరంభించి సూర్యాస్తమయం మొదలు సూర్యోదయంలోపు నూటొక్క శివలింగాలను స్థాపించాలని కార్యదీక్ష తలపెట్టాడని.. దీక్ష ముగిసే సమయానికి వంద లింగాలను మాత్రమే స్థాపించగా ఒక లింగం అప్పుగా మిగిలిపోవడంతో ఇది అప్పుకొండగా మిగిలిపోవాలని ఆయన శాసించి అంతర్ధానమైనట్టు కథ ప్రాచుర్యంలో ఉంది. అప్పుకొండ కాలక్రమేణా 'అప్పికొండ'గా మారి భక్తులను ఆకర్షిస్తోంది. దేశంలోని అతి పురాతన దేవాలయాల్లో ఇది మూడోదని పెద్దలు చెబుతుంటారు. మొదటిది కాశీలో విశ్వేశ్వర స్వామి దేవాలయం కాగా, రెండోది రామేశ్వరంలోని శ్రీరామాలయం' అని చెబుతారు.

విశేషంగా ఉత్సవాలు


శివరాత్రికి ఉత్తరాంధ్ర జిల్లాల్లో మరెక్కడా లేని విధంగా ఇక్కడ ఉత్సవం జరుగుతుంది. జిల్లాలోని అనేక ప్రాంతాల నుంచి స్వామివారిని దర్శించుకోవడానికి భక్తులు వచ్చి మొక్కులు చెల్లించుకుంటారు. వేలాదిమంది భక్తులు శివమాలను ధరించి తమ దీక్షను శివరాత్రి రోజు ముగిస్తారు. ఈ సందర్భంగా లక్షలాది మంది భక్తులు స్వామి వారిని దర్శించుకుంటారు.

ఆకట్టుకొనే శిల్ప సంపద

సోమేశ్వరాలయంలో శిల్ప సంపద, శిలా శాసనాలు గత ప్రాభవానికి సాక్షీభూతంగా నిలుస్తున్నాయి. ఇక్కడ వెలసిన శివలింగాలు, ఆకట్టుకొనే అతిపెద్ద **నల్లరాతి** శిల్పాలు, చోళుల శిలాశాసనాలు, మహానంది, ప్రశాంత సముద్ర తీర ప్రాంతం, సముద్రంలోని కొండలపై డచ్ కాలంనాటి స్తూపాలు, శిల్పాలు ఆకట్టుకుంటాయి. 110 అడుగుల వైశాల్యంతో పూర్తిగా రాతితో ఈ ఆలయాన్ని నిర్మించారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో 17వ శతాబ్దపు విశేషాలు కూడా కనిపిస్తున్నాయి. డచ్చివారు ఈ ప్రాంతాలను కేంద్రాలుగా చేసుకొని తమ నౌకలకు సూచికలను ఇక్కడి కొండపై ఏర్పాటు చేయడం కనిపిస్తుంది. కళా నైపుణ్యానికి అద్దం పట్టే ఇంతటి విశిష్టతను కలిగిన అప్పికొండ సోమేశ్వర ఆలయం ప్రాచుర్యం పొందుతోంది. చాళుక్యుల నిర్మాణానికి నిదర్శనంగా అప్పికొండలో కొన్ని శిలావిగ్రహాలు నేటికీ నిలిచి ఉన్నాయి. ముఖ మండప ప్రాంగణంలో సర్వేసేనాని మార్తాండయ్య, మంత్రి మాచవయ్య ద్వారం ఇరువైపులా చెక్కించిన శిలాశాసనాలు భక్తుల దృష్టిని **ఆకర్షిస్తాయి.**

ఆలయాలకు నూతన శోభ

వినాయకనగర్ ఉడాకాలనీలోని కాశీ విశాలాక్షి విశ్వేశ్వర సహిత పంచాయతన ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. పాతగాజువాక దరి చట్టివానిపాలెం, చిట్టినాయుడుకాలనీ ఈశ్వరాలయం, అయ్యప్పస్వామి ఆలయాలు అలంకరణతో కొత్త శోభను సంతరించుకున్నాయి. దుర్గవానిపాలెం, గాజువాక గౌరీపరమేశ్వరుల ఆలయాల్లో కూడా ఆలయ కమిటీల ప్రతినిధులు ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నారు. బీసీరోడ్డు సంజీవకాలనీలో భద్రావతి భావనారుషీశ్వరుల సమేత సత్యనారాయణస్వామి ఆలయంలో, భానోజీ కాలనీలోని ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయంలో పూజలు ప్రారంభమయ్యాయి. స్వామివారికి రుద్రాభిషేకాలు, రాత్రికి శివలింగార్చన ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. సుందరయ్య కాలనీ దరి దుర్గానగర్‌లోని దుర్గా గణపతి సమేత మహాజ్ఞాన సరస్వతి దేవాలయంలో శివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. లింగోద్భవ కాలంలో స్వామివారికి మహాక్షీరాభిషేకం, తెల్లవారుజామున ఉదయం నాలుగు గంటల నుంచి ఏకాహ రుద్రాభిషేకాలు చేపట్టనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. వుడా డబుల్ రోడ్‌లోని వంటిల్లు జంక్షన్‌వద్ద ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక్కడికి వచ్చే భక్తుల సంఖ్యను దృష్టిలో ఉంచుకొని ఏర్పాట్లు చేస్తున్నట్టు నిర్వాహకులు పేర్కొన్నారు.


అప్పికొండ సోమేశ్వరస్వామి ఆలయం


సోమేశ్వరాలయంలో శివలింగం


ద్వారం ఇరువైపులా ఆకట్టుకొనే శిల్పాలు

కార్మికులకు వేతనాలు చెల్లించాలి


దీక్షలో పాల్గొన్న సీఐటీయూ నాయకులు

కూర్మన్నపాలెం: కార్మికులకు వేతనాల చెల్లింపులో ఉక్కు యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని సీఐటీయూ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రకటించిన ప్యాకేజీలో జీతాలకు ప్రాధాన్యం ఉంటుందని కేంద్ర ఉక్కు మంత్రి ప్రకటించినా ఉక్కు యాజమాన్యం పట్టించుకోవడం లేదన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం జంక్షన్ వద్ద నిర్వహిస్తున్న ఉక్కు పోరాట దీక్ష శిబిరంలో సోమవారం పలువురు సీఐటీయూ నాయకులు వెంకటేశ్వరావు, కృష్ణమూర్తి, శ్రీనివాసరావు, రామారావు, సతీష్ పాల్గొన్నారు.

దంత సంరక్షణపై శ్రద్ధ అవసరం


పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కూర్మన్నపాలెం: దంత సంరక్షణ విషయంలో శ్రద్ధ తీసుకోవాలని దంత వైద్యులు డాక్టర్ సునీత, డాక్టర్ అభి సూచించారు. స్థానిక చిల్డ్రన్స్‌పార్కులో సోమవారం ఆయుష్మాన్ భారత్ గుర్తింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. తిరుమలనగర్‌లోని చిల్డ్రన్ పార్కులో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా దంతవ్యాధులపై అవగాహన కల్పించారు. డాక్టర్ సునీత, డాక్టర్ అభి పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించారు. పలు సూచనలు చేశారు. అనంతరం సిటిజన్ ఫీడ్ బ్యాక్ సర్వేలో పలు అంశాలను ప్రస్తావించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది గోపి,యోగిత,రాణి, అసోసియేషన్ పెద్దలు విశ్వేశ్వరరావు, రాము, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

జమాఖర్చుల వివరాలు వెల్లడించాలి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్‌కు సంబంధించి గత రెండేళ్ల జమాఖర్చుల వివరాలు వెల్లడించాలని ఎస్సీ, ఎస్టీ నాయకులు కోరారు. నాయకులు పి. సోమునాయుడు, బి.ఎ.స్వామి, సురేష్ ఈ మేరకు సోమవారం అసోసియేషన్ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులతో పాటు లైజన్ ఆఫీసర్‌కు వినతిపత్రాలు అందజేశారు. 28 నెలలుగా సభ్యుల నుంచి రికవరీ చేసిన సభ్యత్వ రుసుము ఏ విధంగా ఖర్చు చేశారో తెలపాలని.. రిటైర్‌మెంట్ బెనిఫిట్ ఫండ్ ఎంత మందికి ఇచ్చారో వెల్లడించాలని కోరారు.

వక్ఫ్‌బోర్డు భూములను ఆక్రమిస్తే చర్యలు


హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న అధికారులు

పెదగంట్యాడ: వక్ఫ్‌బోర్డు భూములను ఆక్రమిస్తే చర్యలు తప్పవని వక్ఫ్‌బోర్డు, జిల్లా మైనార్టీ అధికారి హెచ్చరించారు. మండలంలోని దేవాడ గ్రామం తాలూకా టి.డి.నెం.42, సర్వే నెంబర్లు 1 నుంచి 539 వరకూ దర్గా హజరత్ సయ్యద్ ఇసామ్ మదనీ అలియా ఇనాం భూములు ఉన్నాయని తెలిపారు. ఇటీవల సదరు భూములపై ఆక్రమణదారుల కన్ను పడిందన్నారు. ఆ భూముల్లో పాగా వేసి అక్రమంగా లేఅవుట్లు వేస్తున్నారని తమకు ఫిర్యాదు అందిందని వివరించారు. ఈ నేపథ్యంలో సోమవారం ఆయా భూములను పెదగంట్యాడ మండల రెవెన్యూ అధికారులతో కలసి పరిశీలించామన్నారు. సదరు భూముల్లో దువ్వాడ పోలీసుల సహకారంతో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశామని చెప్పారు.

దేవన్‌రెడ్డిని కలిసిన పేడాడ


తిప్పల దేవన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న పేడాడ రమణకుమారి

పెదగంట్యాడ: వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు పేడాడ రమణకుమారి సోమవారం ఆ పార్టీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయన్ను శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో నాయకులు పల్లా చినతల్లి, రోజారాణి, లావణ్య, స్వాతి, పావని, బుజ్జమ్మ, శ్రీదేవి, బొడ్డ గోవింద్, ధర్మాల శ్రీను, బుజ్జి, రాజు, పెంటారావు, రాము పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక


గుడివాడ అమర్‌నాథ్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న కొయ్య భారతి

పెదగంట్యాడ: వైఎస్సార్ సీపీ గాజువాక నియోజకవర్గ మున్సిపల్ విభాగం అధ్యక్షురాలిగా నియమితులైన కొయ్య భారతి సోమవారం వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయన్ను శాలువతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే మాజీ ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, తిప్పల గురుమూర్తి రెడ్డిని కలిశారు. పార్టీలో సముచిత స్థానం కల్పించినందుకు ఆనందంగా ఉందని భారతి నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

మరమ్మతులకు పది రోజులు చాలదా?


లగేజీలు, చంటి పిల్లలతో కుస్తీలు పడుతున్న ప్రయాణికులు



నిర్వహణ పనుల పేరుతో మూసేసిన లిఫ్ట్

- దువ్వాడ రైల్వేస్టేషన్‌లో పడకేసిన లిఫ్ట్
- లగేజీలు, పిల్లలతో ప్రయాణికుల ఆపసోపాలు

అగనంపూడి: దువ్వాడ రైల్వే స్టేషన్‌లో మరమ్మతులకు గురైన లిఫ్ట్‌ను అందుబాటులోకి తేవడానికి పదిరోజుల సమయం సరిపోలేదు. లిఫ్ట్ అండర్ మెయింటెనెన్స్ అనే బోర్డు పది రోజుల నుంచి వేలాడదీసి వదిలేశారు. దీంతో ప్రయాణికులు లగేజీలు, వృద్ధులు, చంటి పిల్లలతో మెట్లు ఎక్కుతూ, దిగుతూ ఆపసోపాలు పడుతున్నారు. లిఫ్ట్ ఏర్పాటు చేసింది మొదలు నెలకోసారి అయినా అంతరాయం కలుగుతోంది. గతనెలాఖరు వరకు లిఫ్ట్‌ను ఏర్పాటు చేసిన కంపెనీ నిర్వాహణను చూసుకోవాల్సి ఉన్నా రైల్వే అధికారుల ఒత్తిడి లేకపోవడంతో తరచూ మరమ్మతులకు గురవ్వడం, ప్రయాణికులు ఇబ్బంది పడడం షరా మామూలే అయిపోయింది. అమృత భారత్ కార్యక్రమంలో కోట్లు వెచ్చించి హంగులు, ఆర్భాటాలు చేస్తున్న రైల్వే ఉన్నతాధికారులు, ఒకటి, నాలుగు ప్లాట్‌ఫారలపై లిఫ్ట్‌తోపాటు ఎస్కలేటర్లు ఏర్పాటు చేయాలనే ఆలోచన లేకపోవడంపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రైల్వే ఉన్నతాధికారులు వెంటనే స్పందించి మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

జ్యోతిర్లింగాల ప్రదర్శన ప్రారంభం


జ్యోతిర్లింగాల ప్రదర్శన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు


నృత్య ప్రదర్శన చేస్తున్న చిన్నారులు


కార్యక్రమంలో పాల్గొన్న బ్రహ్మకుమారీలు

అగనంపూడి: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రజాపిత బ్రహ్మకుమారీస్ సంస్థ అగనంపూడి (దివ్యజ్యోతి భవనం) ఆధ్వర్యంలో జ్యోతిర్లింగాల ప్రదర్శనను ప్రారంభించారు. జ్యోతిర్లింగాల ప్రదర్శనను నాలుగు రోజుల పాటు నిర్వహించనున్నారు. దేశంలోని వివిధ ప్రదేశాల్లో ఉన్న జ్యోతిర్లింగాల నమూనాలను రూపొందించి ఇక్కడ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ నీలబాబు, 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు మాట్లాడుతూ బ్రహ్మకుమారీస్ సంస్థ చేస్తున్న సేవా, ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఎనలేనివన్నారు. సంస్థ విశాఖ జిల్లా ఇన్‌చార్జి బీకే వేణి అక్కయ్య మాట్లాడుతూ సోమవారం నుంచి బుధవారం వరకు రోజూ సాయంత్రం ఐదు నుంచి 8 గంటల వరకు ప్రదర్శన ఉంటుందని తెలిపారు. శివరాత్రి నాడు రోజంతా జ్యోతిర్లింగాల దర్శనం కల్పించడం జరుగుతుందన్నారు. మానవాళి ప్రశాంత జీవనం గడపడం, విశ్వశాంతి కోసం సంస్థ ఆది నుంచి పని చేస్తుందని చెప్పారు. మనిషి అనేక రకమైన ఒడుదుడుకులతో ఒత్తిళ్లకు గురవుతున్నారని, అటువంటి వారికి ప్రశాంతత చేకూర్చడమే సంస్థ లక్ష్యమన్నారు. జిల్లా కోఆర్డినేటర్ బీకే సోమేశ్వరి పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమంలో రాజయోగి బీకే శేఖర్ భాయాజీ, మెట్రో ఫార్మా కంపెనీ హెడ్ జె.శ్రీనివాసరావు, స్థానిక నాయకులు గవర సోమశేఖర్, గుదే సుశీలా గజేంద్రరావు, బలిరెడ్డి సత్యనారాయణ, కిడిమి హనుమంతురావు, కోసూరి తాతారావు, మునాసల అప్పలరాజు, సంస్థ అగనంపూడి ఇన్‌చార్జి బీకే రామకోటి తదితరులు పాల్గొన్నారు.

డిఫెన్స్ మద్యం బాటిళ్ల స్వాధీనం

అక్కిరెడ్డిపాలెం: గాజువాకలోని వంటిల్లు సమీపంలోని హనుమాన్ ఆలయం వద్ద డిఫెన్స్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు గాజువాక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు తెలిపారు. సోమవారం బాష మణికంత, సురేష్ బాబు వద్ద డిఫెన్స్ లిక్కర్ 750 ఎంఎల్ 48 ఫుల్ బాటిళ్లను కలిగి ఉన్నారన్నా సమాచారంతో ఎక్సైజ్ ఏఈఎస్ ఈశ్వరరావు, ఎస్ఐ ముసలినాయుడు, సిబ్బందితో దాడులు నిర్వహించారు. మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని వీరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. అలాగే అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వడ్లపూడి ప్రాంతానికి చెందిన కర్రి భాస్కరరావు రూ.25,000 అపరాధ రుసుం విధించినట్టు చెప్పారు.

తెలుగునాడు ట్రేడ్ వర్కర్స్‌కే టీఎన్‌టీయూసీ గుర్తింపు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో తెలుగునాడు స్టీల్ వర్కర్స్ యూనియన్‌కు మాత్రమే టీఎన్‌టీయూసీ గుర్తింపు ఉందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తెలిపారు. టీఎన్‌టీయూసీ పేరు చెప్పుకుని మరికొన్ని కార్మిక సంఘాలు కార్మికులను గందరగోళానికి గురి చేస్తున్నారన్నారు. టీఎన్‌టీయూసీ అధ్యక్షుడిగా గుమ్మడి నరేంద్రకుమార్, ప్రధానకార్యదర్శిగా నమ్మి సింహాద్రిలను గుర్తించాలని ఆయన కోరుతూ ఆయన సోమవారం స్టీల్‌ప్లాంట్ సీఎండీకి లేఖ రాశారు.

పాత పెన్షన్ తక్షణమే అమలు చేయాలి

విశాఖ విద్య: ఉపాధ్యాయులకు పాత పెన్షన్ తక్షణమే అమలు చేయాలని యూటీఎఫ్‌రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. వేంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సోమవారం గాజువాక, పెదగంట్యాడ మండలాల్లో విస్తృతంగా పర్యటించారు. అనంతరం ఆయన డాబాగార్డెన్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సంఘం బాధ్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2004 సెప్టెంబర్ 1 కంటే ముందు ఉద్యోగ ప్రకటన ఇచ్చి నియామక ప్రక్రియ 2004 తర్వాత పూర్తయిన వారికి పాత పెన్షన్ ఇవ్వాలని 2017లో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన 57 మెమోని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. 2004 సెప్టెంబరు ఒకటి నుంచి పాత పెన్షన్ బదులుగా నూతన కంట్రిబ్యూషన్‌తో కూడిన నూతన పెన్షన్ విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు. 2004 సెప్టెంబర్ కంటే ముందు ఉద్యోగం నియామక నోటిఫికేషన్ ఇచ్చి, వివిధ కారణాలతో ఆలస్యం అవటంవల్ల 2004 సెప్టెంబర్ తరువాత నియామకం పొందిన ఉద్యోగ ఉపాధ్యాయులు రాష్ట్రంలో సుమారు పదివేల మంది ఉన్నారన్నారు. వీరికి పాత పెన్షన్ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ టి .అప్పారావు, జిల్లా కార్యదర్శి ఎం.డి. రిజ్వాన్, గాజువాక మండల ప్రధాన కార్యదర్శి నూకరాజు, సీనియర్ నాయకుడు చలం , జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ రవిబాబు, ఎండీ అబ్దుల్ హక్ పాల్గొన్నారు.

సర్వీసు రోడ్లనూ వదలని బస్సులు


డెయిరీ సిగ్నల్ వద్ద సర్వీసు రోడ్డులో వెళుతున్న బస్సు


ఆటోనగర్ సిగ్నల్ పాయింట్ నుంచి సర్వీసు రోడ్డులో మళ్లించిన బస్సులు

అక్కిరెడ్డిపాలెం: సిగ్నల్ పాయింట్‌లను తప్పించుకునేందుకు ఆర్టీసీ సిటీ బస్సుల డ్రైవర్లు సర్వీసు రోడ్లనూ వదలడం లేదు. భెల్ సిగ్నల్ పాయింట్ వద్ద రెడ్ సిగ్నల్ పడితే వాహనాలు బారులు తీరుతాయి. ఈ సిగ్నల్ పాయింట్‌ను తప్పించుకునేందుకు సిటీ బస్సులు, పలు ఎక్స్‌ప్రెస్ బస్సులను కూడా సర్వీసు రోడ్డులో నడుపుతున్నారు. ముఖ్యంగా ఆటోనగర్ సిగ్నల్ పాయింట్ నుంచి భెల్ సిగ్నల్ పాయింట్‌ను తప్పించుకునేందుకు సర్వీసు రోడ్డుపై మళ్లిస్తున్నారు. ద్విచక్రవాహనాలు, ఆటోలు, కార్లు వంటి లైట్ వెహికల్స్ ప్రయాణించాల్సిన సర్వీసు రోడ్డుపై బస్సులు ప్రయాణించడంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే విశాఖ డెయిరీ వద్ద క్రాసింగ్‌తో గాజువాక వైపు వెళ్లే సిటీ బస్సులను సర్వీసు రోడ్డుపై మళ్లిస్తున్నారు. దీంతో వాహనచోదకులు భయాందోళనకు గురవుతున్నారు. ఈ బస్సులు సరిగ్గా భెల్ సిగ్నల్ పాయింట్ వద్ద తిరిగి హైవేపై మళ్లించే సమయంలో ఇతర వాహనదారులకు తిప్పలు తప్పడంలేదు.అయినా ట్రాఫిక్ సిబ్బంది ప్రేక్షకపాత్ర వహిస్తున్నారు.